క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్, అర్బన్ ఎంపీడీవోలుగా పని చేసిన రాజేశ్వరి, శైలజ రాణి బదిలీ అయ్యారు. జగిత్యాల రూరల్ ఎంపీడీవోగా రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి నీర్ల రమాదేవి, అర్బన్ తహసీల్దార్‌గా కరీంనగర్ నుంచి వేముల విజయలక్ష్మీ జగిత్యాలకు బదిలీపై వచ్చారు. ఇద్దరు ఎంపీడీవోలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

వెల్గటూర్: మండల ఎంపీడీవోగా రవీందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బుగ్గారం: బుగ్గారం నూతన ఎంపీడీవోగా ఎం.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మల్లాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

పెగడపల్లి: పెగడపల్లి ఎంపీడీవోగా ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

మల్యాల: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎ.స్వాతి బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ ఎస్సైగా ఐకే రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణ ఎస్సైగా పని చేసిన అబ్దుల్ రహీం మల్యాల ఎస్సైగా ఇటీవల బదిలీ కాగా.. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి పట్టణ ఎస్సైగా ఐకేరెడ్డి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

వివాహితల ఆత్మహత్య

పెగడపల్లి: కీచులాటపల్లికి చెందిన దుర్మట్ల శ్వేత(28) అనారోగ్యంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. శ్వేత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ఎన్ని మందులు వాడినా నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శ్వేత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్యహత్య చేసుకుంది. ఆమె భర్త కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మల్యాల(చొప్పదండి): మల్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకుంది. అమ్ముల సుజాత(56) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లోని బాత్రూంలో ఉరేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చైర్‌పర్సన్‌గా బీసీ మహిళను ఎన్నుకోవాలి

జగిత్యాలటౌన్/జగిత్యాల: జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్‌గా బీసీ మహిళను ఎన్నుకోవాలని కాంగ్రెస్ బల్దియా ఫ్లోర్ లీడర్ కళ్లెపెల్లి దుర్గయ్య కోరారు. బల్దియా ఇన్‌చార్జి చైర్మన్‌పై బుధవారం నిర్వహించిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడం దురదృష్టకరమని, అవిశ్వాస తీర్మానం వీగిపోవడానికి బీఆర్ఎస్ కౌన్సిలర్ల అవకాశవాద రాజకీయాలే కారణమని, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సరికాదు

బల్దియా చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టిన బీఆర్ఎస్ కౌన్సిలర్లే అవిశ్వాసంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి గైర్హాజరవడమేమిటని బీజేపీ ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి ప్రశ్నించారు. బుధవారం జరిగిన బల్దియా ప్రత్యేక సమావేశం అనంతరం మాట్లాడారు.

బీసీకి అవకాశమివ్వాలి

మున్సిపల్ చైర్మన్ పదవి బీసీ బిడ్డకివ్వాలని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ కోరారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌పై 29 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టడం జరిగిందని, కానీ బీఆర్ఎస్‌కు చెందినవారు హాజరు కాకపోవడం సమంజసం కాదన్నారు.

ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల: విద్యార్థులు మత్తుకు బానిస కావద్దని, వారిలో చైతన్యం తెచ్చేలా సంఘాలు అవగాహన కల్పించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏఐఎస్ఎఫ్‌కు సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మంచి మార్గంలో నడిపించేలా చూడాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్, పట్టణ అధ్యక్షుడు శివసాయిరెడ్డి, రాహుల్, నాగరాజు, ఓంకార్ పాల్గొన్నారు.

అందుబాటు ధరలో అపార్ట్‌మెంట్స్



పనులు ప్రారంభిస్తున్న హరిచరణ్‌రావు

జగిత్యాల: అందుబాటు ధరలో అపార్ట్‌మెంట్స్ జగిత్యాలలో నిర్మిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు అన్నారు. బుధవారం ధరూర్‌లో రాధ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌కు భూమిపూజ నిర్వహించారు. రాధ రెసిడెన్సీ వారు 12 సంవత్సరాలుగా అందరికీ అందుబాటు ధరల్లో అపార్ట్‌మెంట్స్ నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్ రావు, శీలం సురేందర్, రాధ రెసిడెన్సీ నిర్వాహకుడు చల్ల గోవర్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



కోరుట్ల అయ్యప్ప జ్ఞాన సరస్వతి ఆలయంలో..



మల్లాపూర్ వాసవీ కన్యకా పరమేశ్వరి మాత ఆలయంలో కుంకుమార్చన



జగిత్యాలరూరల్: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో వీరలక్ష్మీ



రాయికల్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి

వసంత పంచమి వేడుకలు

జగిత్యాలరూరల్/గొల్లపల్లి/రాయికల్/కోరుట్ల/పెగడపల్లి/మెట్‌పల్లిరూరల్/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం/కథలాపూర్/మల్లాపూర్: జిల్లాలో వసంత పంచమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గ్రామాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆలయాలు, పాఠశాలల్లో వేడుకలు జరిపారు. పూజలు చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం కేజీబీవీలో సరస్వతి మాతకు పూజలు చేస్తున్న విద్యార్థులు



సారంగాపూర్ సరస్వతి అమ్మవారి ఆలయం వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం



సిరికొండలో పూజలు చేస్తున్న విద్యార్థులు



పెద్దాపూర్ గురుకులంలో పూజలు చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

రాయికల్‌కు బస్సు పునఃప్రారంభం



బస్సు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి స్పందన

రాయికల్: జగిత్యాల డిపోకు చెందిన నైట్‌హాల్ట్ బస్సును సాక్షి కథనంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవతో బుధవారం ప్రారంభమయినట్లు జగిత్యాల డిపో మేనేజర్ సునీత తెలిపారు. బుధవారం సాక్షిలో 8 దాటితే బస్సు లేదు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించి జగిత్యాల డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. జగిత్యాల డిపో నుంచి రాత్రి 9 గంటలకు నైట్‌హాల్ట్ బస్సు కొత్తపేటకు బయల్దేరుతుందని, తిరిగి మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు కొత్తపేట గ్రామం నుంచి బయల్దేరుతుందని డిపో మేనేజర్ తెలిపారు. రాయికల్ పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు రాయికల్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు వద్ద ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి, సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవతో ఎన్నో ఏళ్లుగా మండల, పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న నైట్‌హాల్ట్ బస్సు తిరిగి పునఃప్రారంభం కావడంతో ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. యూత్ కాంగ్రెస్ సెక్రటరీ కొయ్యడి మహిపాల్‌రెడ్డి, ఎద్దండి భూంరెడ్డి, చింతలపల్లి గంగారెడ్డి, మీనుగు అంజయ్య, మండ రమేశ్, గన్నవరం ప్రభాకర్, బాపురపు నర్సయ్య, భూమాగౌడ్, నర్సింహారెడ్డి, ఆనంద్, మున్ను పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

పెగడపల్లి: లింగాపూర్ గ్రామంలో ఈనెల 20 నుంచి 24 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు శ్రీలక్ష్మినృసింహస్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. 20న స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, నందాదీప స్థాపన, అగ్ని ప్రతిష్ట, 21న నిత్యహోమం, బలిహరణ, తీర్థప్రసాద వితరణ, కుంకుమార్చన, 22న హోమం, సదస్య మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, 23న అన్నదానం, ఎడ్లబండ్ల పోటీలు, 24న రథహోమం, రథబలి, స్వామివారి రథోత్సవం, స్వామివారి దర్శనం, ఏకాంతసేవ తదితర కార్యక్రమాలు జరుగుతాయి.

నియామక పత్రాలు అందుకున్న కానిస్టేబుళ్లు

జగిత్యాలక్రైం: జిల్లాలో పోలీస్ కానిస్టేబుళ్ల నియామకాల్లో అర్హత సాధించిన అభ్యర్థులు బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందుకున్నారు. జిల్లా నుంచి 261 మంది కానిస్టేబుళ్లు ఎంపిక కాగా, అందులో 227 మంది పురుషులు, 34 మంది మహిళలున్నారు. వీరు నియామక పత్రాలను అందుకున్నారు. త్వరలో వీరు శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరనున్నారు.

రాయికల్ మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు

రాయికల్: రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు బుధవారం కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్, ఉపాధ్యక్షులు, సభ్యుల పదవీకాలం రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఆయన చెప్పారు.

రేపు అవిశ్వాస పరీక్ష

రాయికల్: రాయికల్ మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఈనెల 16న ఉదయం 11 గంటలకు అవిశ్వాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి, జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి బుధవారం తెలిపారు. కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

రాయికల్ మున్సిపల్ మేనేజర్‌గా ప్రకాశ్

రాయికల్: రాయికల్ మున్సిపాలిటీ మేనేజర్‌గా ప్రకాశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన వెంకట్ నిజామాబాద్ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు.

రోడ్డు భద్రతపై అవగాహన



బుగ్గారం: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎస్సై శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో గ్రామంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఆటో యూనియన్ సభ్యులు, రోడ్డు ప్రమాద బాధితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ



రాయికల్: ఉప్పుమడుగు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ప్రజాచైతన్య వేదిక ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. జర్నలిస్ట్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి, స్పెషల్ ఆఫీసర్ శోభారాణి, ప్రజాచైతన్య వేదిక మండల అధ్యక్షుడు చింతకుంట సాయికుమార్, సిబ్బంది రాజశ్రీ, అరుణ్ పాల్గొన్నారు.

పుల్వామా అమర వీరులకు నివాళి



జగిత్యాలటౌన్: నివాళి అర్పిస్తున్న భారత్ సురక్షా సమితి సభ్యులు

జగిత్యాలటౌన్: పుల్వామా ఉగ్రదాడిలో దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన అమర జవాన్లకు భారత్ సురక్షా సమితి సభ్యులు ఘన నివాళి అర్పించారు. భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో అమర జవాన్లకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, వేముల పోచమల్లు, కొక్కుల ఆంజనేయులు, తునికి అంజన్న, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని సామాజిక సేవకులతో పాటు ప్రగతి ఉన్నత పాఠశాలలో నివాళులర్పించారు. సామాజిక సేవకుడు లింగ శ్రీనివాస్, గంప ఆనందం, నరేందర్, చింత శివకుమార్, ప్రణయ్, సాదిక్, ముఖీద్, రజాక్, ప్రగతి కరస్పాండెంట్ బాలె శేఖర్ పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో గాంధీ విగ్రహం నుంచి నంది కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ యువకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఇబ్రహీంపట్నం: గొధూర్ గ్రామంలో మల్లన్న స్వామి దేవాలయం ఆవరణలో ఈజీఎస్ నిధులు రూ.7లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గ్రామ ప్రత్యేకాధికారి మల్లేశ్ బుధవారం భూమిపూజ చేశారు. తిమ్మాపూర్ తండాలో ఈజీఎస్ నిధులు రూ.6లక్షలు, కేశాపూర్‌లో రూ.4లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకట్, సర్పంచ్ సామ ప్రభాకర్, ఎంపీటీసీ తిమ్మని రాములు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొటగిరి చైతన్య, నాయకులు వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, కమలకర్‌రెడ్డి, రాజరెడ్డి, సిద్ధార్థ, లక్‌పతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దాం

మల్లాపూర్: గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ ఎల్లాల జలపతిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. రూ.5లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ మరిపెల్లి సత్తెమ్మమల్లయ్య, కాంగ్రెస్ నాయకులు కోటగిరి ఆనంద్‌గౌడ్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నూతిపెల్లి రాజం, వేంపేట లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేడిపల్లి: కట్లకుంట, వెంకట్రావుపేట, బీమారం గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



గొధూర్‌లో భూమిపూజ చేస్తున్న ప్రత్యేకాధికారి

కొత్తపేటలో బోరుబావి ప్రారంభం

రాయికల్: కొత్తపేట గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి నాగాలయంలో మండల పరిషత్ నిధుల నుంచి ఏర్పాటు చేసిన బోరుబావిని బుధవారం ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి ప్రారంభించారు. ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్ బత్తిని రాజేశంగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ ప్రవీణ్, కార్యదర్శి నరేశ్, నాయకులు రమేశ్, రాజన్న, మీనుగు అంజయ్య పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయాలి

మెట్‌పల్లి: దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ కోరారు. మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ముందు బుధవారం కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశంలోని కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్ నిర్వహించనున్నట్లు చెప్పారు. మున్సిపల్ కార్మికులు లక్ష్మణ్, శ్రీకాంత్, ఇబ్రహీం, మహేశ్, మధురమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి: నిరసన తెలుపుతున్న కార్మికులు

భారత్ బంద్ పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల: ఈనెల 16న గ్రామీణ భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన క్రమంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్మికులు బంద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఏఐటీయూసీ నాయకుడు సుతారి రాములు మాట్లాడుతూ.. దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ ప్రతినిధులు సాయిలు, రాజు, నర్సింహులు, సుగుణ, నవీన్, గంగారాం, గంగు, రవి, రమేశ్ పాల్గొన్నారు.

ఆవోపా కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కోరుట్ల: కోరుట్ల ఆర్యవైశ్య ప్రొఫెషనల్స్ అండ్ అఫీషియల్స్ కార్యవర్గం బుధవారం వాసవీ కల్యాణ భవనంలో ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా కోటగిరి మహేశ్, కార్యదర్శిగా బద్దుకూరి శ్రీమన్నారాయణ, కోశాధికారిగా నీలి సంతోష్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా ఆవోపా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త సురేష్, కార్యదర్శి కటుకం రాజేశ్, జగిత్యాల పట్టణాధ్యక్షుడు పబ్బ శ్రీనివాస్, కార్యదర్శి మోటూరి శ్రీనివాస్, కోశాధికారి ఊటూరి నవీన్, బుడిగె శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఉన్నత స్థానంలో నిలవాలి



జగిత్యాల: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానంలో నిలవాలని నవ్య కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ సూచించారు. ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్స్ సెషన్‌లో శాలిని, జూపాక మాధురి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈశ్వర్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రేతో లాభాలు



సారంగాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

సారంగాపూర్: పంటలపై డ్రోన్ స్ప్రే ద్వారా పిచికారీ చేస్తే రైతులకు అధిక లాభాలుంటాయని అధికారులు పేర్కొన్నారు. సారంగాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఇఫ్కో సంస్థ సంయుక్తంగా రైతులకు డ్రోన్ స్ప్రేపై అవగాహన కల్పించారు. సారంగాపూర్ సహకార సంఘంలో డ్రోన్ స్ప్రే పంటలపై పురుగు, ఇతర మందులను పిచికారీ చేయడానికి అందుబాటులో ఉంటుందన్నారు. డ్రోన్ స్ప్రే ద్వారా కూలీల కొరత ఉండదని, ప్రతిరోజు డ్రోన్ స్ప్రే ద్వారా 30 ఎకరాల్లో మందులను స్ప్రే చేయొచ్చని, స్ప్రే చేసే వ్యక్తిని సంఘం సమకూర్చుతుందని తెలిపారు. మార్కెట్‌లోకి వచ్చిన నానో యూరియాను కూడా దీని ద్వారా స్ప్రే చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విండో అధ్యక్షుడు ఏలేటి నర్సింహ్మారెడ్డి, విండో సీఈవో ఎండీ ఇస్మాయిల్, డైరెక్టర్లు కోంద్ర రాంచంద్రారెడ్డి, ఎండీ ఇబ్రహీం, ఏఈవో వెంకటేష్, మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి



జగిత్యాల: మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ కాళ్లపై తాము నిలబడాలనే దృఢ సంకల్పంతో జగిత్యాలలో టీ-లైఫ్ సంస్థను ఏర్పాటు చేస్తున్నామని టీ-లైఫ్ రాష్ట్ర ఆర్గనైజర్ దీపికరెడ్డి తెలిపారు. మహిళా సాధికారత కోసం రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు శిక్షణ ఇప్పిస్తున్నామని, ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు సైతం కల్పిస్తామన్నారు. టీలైఫ్ మహిళా ఆర్గనైజింగ్ సంస్థ సైతం జగిత్యాలలో ఈనెల 16న ఏర్పాటు చేస్తున్నట్లు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కొమురయ్య

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆటో యూనియన్ మండల అధ్యక్షుడిగా బుధవారం వీరవేని కొమురయ్య ఎన్నికయ్యారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. పూలమాల, శాలువాతో సన్మానించారు. గెలుపునకు కృషి చేసిన యూనియన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

ధర్మపురి: దొంతాపూర్ గ్రామానికి చెందిన చల్ల నర్సయ్య భార్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులను బుధవారం బుగ్గారం జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మైసమ్మ చెరువులోకి నీటి విడుదల

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం మైసమ్మ చెరువులోకి నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి బుధవారం నీటిని విడుదల చేశారు. చెరువు నుంచి పొలాలకు త్వరలో నీటిని విడుదల చేయనున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం చొరవతో పొలాలకు సకాలంలో నీళ్లు అందుతున్నాయని తెలిపారు. నాయకులు చిలువేరి నారాయణగౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, గడ్డం జీవన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బండి లక్ష్మీరాజంతో కలిసి మైసమ్మ చెరువును పరిశీలించారు.

ఫిజికల్ డైరెక్టర్‌గా గౌతమి



గొల్లపల్లి: గురుకుల ఫిజికల్ డైరెక్టర్‌గా మండల కేంద్రానికి చెందిన గౌతమి ఉద్యోగం సాధించారు. స్టేట్‌లో 137వ ర్యాంక్ సాధించి ఉద్యోగం పొందారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గౌతమిని అభినందించారు.